క్లుప్తంగా

యువ శాస్త్రవేత్తలకు ఫారడే జీవితం స్ఫూర్తిదాయకం



పెదకూరపాడు: యువ శాస్త్రవేత్తలకు మైఖేల్ ఫారడే జీవితం స్ఫూర్తిదాయకమని పెదకూరపాడు జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ అన్నారు. సోమవారం పాఠశాలలో ప్రముఖ భౌతిక, రసాయన శాస్త్రవేత్త మైఖేల్ ఫారడే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రసాయన శాస్త్రంలో మైఖేల్ ఫారడే సేవలను కొనియాడారు. బుక్ బైండర్‌గా పనిచేస్తూ తన వద్దకు వచ్చిన పుస్తకాలను చదివి సైన్స్ పట్ల మక్కువ పెంచుకున్నారన్నారు. స్వయంకృషితో అనేక ప్రయోగాలు చేసి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగారన్నారు. యువ శాస్త్రవేత్తలు శాస్త్రీయ అభిరుచులను, వైఖరులను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదల పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



మాదల(ముప్పాళ్ళ): మాదల పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. సంఘం చైర్మన్‌గా చిమటా పోలురాజు, డైరెక్టర్లుగా కొల్లా కోటేశ్వరరావు, బొప్పూడి లక్ష్మణ్‌రావులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని నూతన సభ్యులు సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ రావిపాటి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 3 అర్జీలు



ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. ముప్పాళ్ళ గ్రామంలో ప్రభుత్వ కాల్వ హద్దులు చూపించాలని కోరుతూ అర్జీ, గోళ్ళపాడులో భూమి హద్దు సర్వే చేయమని, మాదలలో పట్టాదారు పాస్‌బుక్ కోసం అర్జీలు అందాయన్నారు. ఆయా అర్జీలను పరిష్కరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతం పరిశీలన



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువను మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలను ఈ నెల 30 నుంచి నిమజ్జనం చేయనున్న దృష్ట్యా ఆ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన గుంటూరు బ్రాంచ్ కాలువను పరిశీలించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, సిబ్బంది ఉన్నారు.

హైవేనే షెల్టర్..!

- బస్సుల కోసం రోడ్డుపైనే వేచి ఉంటున్న విద్యార్థులు, ప్రయాణికులు
- రోడ్డు దాటే క్రమంలోను పొంచి ఉన్న ప్రమాదం
- బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



నకరికల్లులోని హైవేపై బస్సు ఎక్కేందుకు వెళ్తున్న విద్యార్థులు

నకరికల్లు: మండల కేంద్రమైన నకరికల్లులో బస్ షెల్టర్ లేక విద్యార్థులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నకరికల్లులోని ఉన్నత పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం విద్యార్థులు ఎండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి. రోడ్డు రవాణా శాఖ గానీ ప్రభుత్వం గానీ కనీసం చిన్నపాటి షెల్టర్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎండైనా, వానైనా ఎదుర్కోక తప్పని దుస్థితి ఏర్పడింది.

అవస్థలు తప్పడం లేదు

నకరికల్లులోని ఉన్నత పాఠశాలకు శ్రీరాంపురం, నర్సింగపాడు, బాలాజీనగర్‌తండా, శివాపురంతండాలతో పాటు సమీప ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకుంటారు. ఆయా గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తారు. ఈ క్రమంలో ఉన్నత పాఠశాల నుంచి రోడ్డుకు ఇవతలి వైపున ఉన్న పిడుగురాళ్ల బస్టాప్‌కు వచ్చి బస్సెక్కాల్సి ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి దాటుకొని ఇవతలి వైపుకు రావాల్సి ఉండడంతో పలు మార్లు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. పిడుగురాళ్ల వైపు వెళ్లే బస్టాప్ వద్ద గానీ, నరసరావుపేట వైపు వెళ్లే బస్టాప్ వద్ద గానీ బస్ షెల్టర్ కూడా లేదు. కనీసం కూర్చునే వసతి కూడా లేదు. హైవేపై నిలబడితే వేగంగా వచ్చే వాహనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. బస్సుల కోసం వేచి ఉండే సమయంలో ప్రయాణికులు, విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం చిన్నపాటి నీడనైనా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



బస్సు కోసం ఎండలో హైవేపై వేచి ఉన్న విద్యార్థులు

మా గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించండి

సత్తెనపల్లి: తమ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని పంచాయతీలుగానే కొనసాగించాలంటూ పలు గ్రామాల ప్రజలు కోరారు. సత్తెనపల్లి మండలం భీమవరం, కంకణాలపల్లి శివారు గ్రామాలైన వెన్నాదేవి, వావిలాలనగర్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసేందుకు ఆయా గ్రామాల ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా సోమవారం గ్రామ సభలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిశనం యోనా, చెరుకూరి వన్నూరు అధ్యక్షతన నిర్వహించారు. భీమవరం పంచాయతీకి సంబంధించిన ఎస్సీ కాలనీ, ఇందిరా కాలనీ వాసులు మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియ తమకు ఇష్టం లేదని స్పష్టంగా ప్రకటించారు. తమ గ్రామ పంచాయతీని యథావిధిగా కొనసాగించాలని, బలవంతంగా మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియను చేపట్టవద్దన్నారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే శిస్తు, ఇంటి పన్ను వంటివి పెరిగిపోతాయని అవి చెల్లించే స్థోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని పంచాయతీ గానే కొనసాగించాలని పంచాయతీ కార్యదర్శి చైతన్యకు గ్రామస్తులు పాలేటి పిచ్చయ్య, పి.బాలయ్య తదితరులు వినతిపత్రం అందించారు. అలాగే కంకణాలపల్లి సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో కంకణాలపల్లి, వెన్నాదేవి, వావిలాల నగర్‌లో వేర్వేరుగా గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో విలీనం చేయడం వలన కలిగే లాభనష్టాలను వివరించాలని కోరారు. ఈ మేరకు మూడు చోట్ల గ్రామ సభలు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బాషాను కోరారు. రామకృష్ణాపురం, మురళీనగర్ గ్రామ సభలు సోమవారం నిర్వహించలేదు. మంగళవారానికి వాయిదా వేసినట్లు నందిగామ పంచాయతీ కార్యదర్శి కుంభా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే కఠిన చర్యలు



అంచులవారిపాలెం రైతు సేవా కేంద్రంలో పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ, ఏవో



ముప్పాళ్ళలో పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, హనుమంతురావు

రాజుపాలెం: ప్రైవేటు డీలర్స్, సొసైటీలలో ఎరువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సరోజని హెచ్చరించారు. మండలంలోని అంచులవారిపాలెం, కోటనెమలిపురి, పెదనెమలిపురి గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దారు, ఎస్ఐ వేణుగోపాల్, ఏవో వెంకట నర్సయ్యలు సోమవారం పరిశీలించారు. అదేవిధంగా ప్రైవేటు దుకాణాలలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎరువులు కృత్రిమ కొరత సృష్టించితే అటువంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఎమ్మార్పీకే మాత్రమే ఎరువులు విక్రయించాలని, స్టాకు బోర్డు ఏర్పాటు చేయాలని, రైతులు అధైర్య పడవద్దని, ప్రతిరోజు రైతు సేవా కేంద్రాలు, సొసైటీలలో పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాలలో ఎరువుల కోసం ఇండెంట్ పెట్టడం జరిగిందని, ప్రస్తుతం ఐదు రైతు సేవా కేంద్రాలలో ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం తహసీల్దారు స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

ముప్పాళ్ళ: ఎరువుల అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. మండలంలోని గ్రోమోర్, జీడీసీఎంఎస్, లంకెలకూరపాడులోని లక్ష్మీశ్రీనివాస ఎరువుల దుకాణాలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులను పరిశీలించి నిల్వలను సరిచూశారు. యూరియాకు ఇతర ఎరువులు బలవంతంగా ఇవ్వవద్దన్నారు. అమ్మిన వివరాలను తప్పనిసరిగా ఈ–పాస్‌లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. స్టాకు వివరాలను బోర్డులలో డిస్‌ప్లే చేయాలన్నారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీఏ హనుమంతురావు, ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



బెల్లంకొండలో ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న ఏవో, ఎస్ఐ

రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

బెల్లంకొండ: దుకాణదారులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని ఏవో అరుణకుమారి సూచించారు. సోమవారం మండలంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను ఎస్ఐ డి.ప్రవీణ్‌తో కలిసి తనిఖీ చేశారు. నాణ్యతలేని విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలలోని ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. నిషేధిత పురుగుమందుల విక్రయం నేరమని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని, అదేవిధంగా కొనుగోలు చేసిన ప్రతిదానికి బిల్లులు ఇవ్వాలని సూచించారు.

పత్తిలో రసం పీల్చే పురుగులను అరికట్టండి



అమరావతి: ప్రస్తుతం పత్తి పైరును ఆశించే రసం పీల్చు పురుగుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి అరికట్టాలని ఏవో అహ్మద్ అన్నారు. సోమవారం ఆయన రసం పీల్చే పురుగులను గురించి వివరిస్తూ బీటీ పత్తిని రసం పీల్చే పురుగుల బారి నుంచి రక్షించుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. బీటీ పత్తికి రసం పీల్చే పురుగులను నిరోధించే శక్తి లేదు కాబట్టి అవి ఆశిస్తే వాటి నివారణకు అవసరాన్ని బట్టి లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రొటోఫాస్, రెండు మిల్లీలీటర్ల మిథైల్ డెమటాన్, 0.4 మిల్లీలీటర్ల ఇమిడాక్లోప్రిడ్ 200 ఎస్ఎల్, 0.2 గ్రాముల ఎసిటామిప్రిడ్ , 0.2 గ్రాముల థయోమిథాక్సామ్ లేదా 1.5 గ్రాముల ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు.

‘చలో విజయవాడ’ పోస్టర్ల ఆవిష్కరణ



క్రోసూరు: పాత పెన్షన్ సాధన కొరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సంఘం ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సెప్టెంబర్ 1వ తేదీన చేపట్టిన చలో విజయవాడ నిరసన కార్యక్రమం విజయవంతం చేయాలని ఆ సంఘం ప్రతినిధులు మండలంలోని పలు పాఠశాలల్లో పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలూరి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధన కలగా మిగిలిందని, దశాబ్దాలుగా శాంతియుత నిరసనలు, ర్యాలీలు చేస్తున్నారని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. దానిలో భాగంగానే సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ విజయవాడలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలాది మంది ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్ఈఏ సంఘం ప్రతినిధులు తూమాటి శరత్‌కుమార్, బోళ్ల నరసింహ రెడ్డి, చిలకా సురేష్ , కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువురు యువకులపై పీడీ యాక్ట్

సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన ఇరువురు యువకులను పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారిరువురి పై పీడీ యాక్ట్ కేసు నమోదు చేశారు. పట్టణంలోని రాజుల కాలనీకి చెందిన భోగ్యం నాగ శ్రీకాంత్, క్రిస్టియన్ పేటకు చెందిన యర్రసాని గోపిలపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి వారిని రాజమండ్రి సెంట్రల్ జైలులో అప్పగించారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెం గ్రామం సంగం డెయిరీ పాల కేంద్రంలో పాడి రైతులకు సోమవారం బోనస్‌లను పంపిణీ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గానూ 84 మంది పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లను అందజేసినట్లు గంగిరెడ్డిపాలెం సంగం డెయిరీ బ్రాంచ్ ఇన్‌చార్జి మేనేజర్ నవీన్ తెలిపారు. రూ.100 విలువ గల పాలకు రూ.4 చొప్పున ఉత్పత్తిదారుల నుంచి సేకరించిన పాలకు రూ.1,10,178 బోనస్‌ను పంపిణీ చేశారు. పాడి పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, పాల ఉత్పత్తిని పెంచాలని పాడి రైతులకు సూచించారు. అదే విధంగా గ్రామంలో గడ్డిజొన్న వేసిన ఏడుగురు పాడి రైతులకు సబ్సిడీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు సాయి తేజ, వెంకటేశ్వర్లు, పాల కేంద్రం ప్రెసిడెంట్ బాణావతు అంజలి బాయి, సెక్రటరీ కుటుంబరావు నాయక్, పాడి రైతులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్‌లు పంపిణీ

పెదకూరపాడు : పెదకూరపాడు సంగం డెయిరీ పాల ఉత్పత్తిదారులకు సోమవారం బోనస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ డైరెక్టర్ ఓలేటి ధర్మారావు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం సంగం డెయిరీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. గ్రామంలో పాల ఉత్పత్తిదారులకు రూ.6,34,000 బోనస్‌గా పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్తిమళ్ల రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రాంగోపాలరావు, బాబూరావు రైతు సంఘం నాయకులు భాష్యం ఆంజనేయులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, డెయిరీ అధ్యక్షుడు గొండపునేని బాషా, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, ఉప సర్పంచ్ రఘు, మద్దినేని వెంకట సత్యం తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తున్న డెయిరీ సిబ్బంది



పెదకూరపాడులో బోనస్ పంపిణీ చేస్తున్న డెయిరీ డైరెక్టర్ ధర్మారావు

ఎరువులను అందుబాటులో ఉంచకుంటే ఆందోళన చేస్తాం

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రవిబాబు

ఎర్రబాలెం(క్రోసూరు): ప్రభుత్వం రైతులకు యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచకుంటే ఆందోళన చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వరి, పత్తి, మిరప పంటలు పండించే రైతులకు యూరియా చాలా అవసరమని ప్రస్తుతం యూరియా ధర అందుబాటులో లేకుండా పోయిందని 45 కిలోల యూరియా బస్తా ధర రూ.267.50కు ప్రభుత్వం రైతులకు అందించాల్సి ఉండగా మార్కెట్లో అదనంగా రూ.130–150 చెల్లించాల్సి వస్తుందని అన్నారు. రైతులకు అవగాహన కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం యూరియాకి ప్రత్యామ్నాయంగా నానో ఎరువుల్ని అందిస్తుందని, నానో ఎరువులు శాస్త్రీయంగా దిగుబడికి సహకరించడం లేదనే అభిప్రాయాన్ని కొన్ని యూనివర్సిటీలు చెబుతున్నాయని, దీంతో రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని అన్నారు. ఇప్పటికే గత ఏడాది పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్న రైతులకు ఎరువుల భారాన్ని రైతులపై వేయటం అన్యాయమని, యూరియా నిల్వలను గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్లు, సొసైటీలలో అందుబాటులో ఉంచాలని లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం క్రోసూరు మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, మండల కమిటీ సభ్యులు రావెళ్ల వెంకటేశ్వర్లు, చిలక ఏషియా, ఏపూరి వెంకటేశ్వర్లు, అత్తోట బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిబాబు

ఆటో డ్రైవర్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నకరికల్లు: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు అన్యాయం చేసిందని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మండిపడ్డారు. స్త్రీశక్తి పథకం అమలు చేసే క్రమంలో ఆటోడ్రైవర్‌లకు వచ్చే సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదంటూ ఆటోవర్కర్‌లు సోమవారం నిరసన వ్యక్తం చేసి, డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారికి మద్దతుగా నిలిచిన పీడీఎం అధ్యక్షుడు మస్తాన్‌వలి మాట్లాడుతూ ఉచిత బస్సు పథకం అమలుతో ఆటోడ్రైవర్‌ల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ఏరాజుకారోజు ఆటో తోలుకొని జీవించే డ్రైవర్‌లు, కార్మికుల ఉపాధిపై ప్రభావం పడిందన్నారు. బాడిగలు లేక రోజు గడవడం కష్టంగా మారిందన్నారు. ఆటోలు కొనేందుకు చేసిన అప్పుకు కిస్తీలు కట్టాలని, పెరిగిన నిత్యావసరాలు, ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు ఆర్థికంగా కుంగదీస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి ఆటోడ్రైవర్‌లను ఆదుకుంటామని ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోవర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు నాగుల్ మీరా, ఉపాధ్యక్షుడు షేక్ మునాఫ్, కార్యదర్శులు జానీ, నాగూర్‌వలి, సూర్తాని శ్రీను, బాబు, నాగుర్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ కొండారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పీడీఎం అధ్యక్షుడు మస్తాన్‌వలి, ఆటో డ్రైవర్‌లు

బాబును నమ్మితే మోసం గ్యారంటీ



వైకుంఠపురంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి కోటేశ్వరరావు

అమరావతి: మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి గ్రామాలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజల్ని మోసం చేశారని ఆరోపించారు. మోసపూరిత మాటలు, అబద్ధపు వాగ్దానాలతో గద్దెనెక్కారన్నారు. అనంతరం బాబు మోసపూరిత ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అలా లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు నాయుడు సాంబశివరావు, ఎండ్రాయి పెదమద్దూరు గ్రామాల సర్పంచ్‌లు నాయుడు రాంబాబు, జాష్టి శ్రీనాథ్, వైకుంఠపురం ఉప సర్పంచ్ గుబ్బా కృష్ణయ్య, మండల వైఎస్సార్‌సీపీ ఆర్ఎంపీ వైద్యుల విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, నాయకులు వీరరాఘవయ్య, నండూరు రామారావు, రంగిశెట్టి శ్రీను, మంగిశెట్టి శ్రీను, పసుపులేటి శ్రీను, పలు అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వినాయక మండపాలు



గార్లపాడు సెంటర్‌లో రూపుదిద్దుకుంటున్న మండపం



అచ్చంపేటరోడ్డులో కోటమ్మ సత్రం వద్ద పూర్తయిన గణేష్ మండపం



నాగన్నకుంటలో నారికేళ గణపతి విగ్రహానికి మండపం

సత్తెనపల్లి: వినాయక చవితి పండుగను పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎంతో ఉత్సాహంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజులపాటు పందిళ్లలో స్వామి వద్ద పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఆనందంగా గడుపుతారు. 27న వినాయక చవితిని పురస్కరించుకుని పట్టణంలో భారీ మండపాల ఏర్పాటు మొదలైంది. ప్రధాన రోడ్లపైనే కాక వీధి కూడళ్లు, సందు, గొందుల్లో కూడా చవితి మండపాల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. కొన్ని చోట్ల పందిళ్ల నిర్మాణం పూర్తి కాగా మరికొన్ని చోట్ల కొనసాగుతుంది. వాడవాడలా భారీ విగ్రహాలను ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. స్వామి వారిని నిలబెట్టేందుకు పీఠం, కర్రలు, టార్పాలిన్‌లతో టెంట్లు వేసి మండపాలను సిద్ధం చేశారు. వాటిని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరిస్తున్నారు.

అనాథాశ్రమంలో వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధి వీరమ్మ కాలనీలోని డాక్టర్ అంబేడ్కర్ అనాథపిల్లలు, వృద్ధుల ఆశ్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్ సోమవారం విద్యార్థులకు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ ఉన్నవారికి మందులను పంపిణీ చేశారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, సీహెచ్‌వో ప్రియదర్శిని, ఏఎన్ఎమ్ శారద, ఆశా కార్యకర్తలు సుజాత, మరియమ్మ, మునిరాబేగం తదితరులు ఉన్నారు.